విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలి

జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా ప్రజలందరూ సుభిక్షంగా పాడిపంటలతో శాంతి భద్రతలు కలిగి ఉండాలని జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ అన్నారు. సీతారామ కళ్యాణ మహోత్సవమును ఏలూరు అమీనాపేటలో ఉన్న పోలీసు ప్రధాన కార్యాలయం సమీపంలో ఉన్న అభయాంజనేయ స్వామి వారి దేవాలయం ప్రాంగణంలో అంగరంగ వైభోగంగా పోలీసు, ప్రజల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ మనిషి మనిషిగా బతకడానికి అవసరమైన నిఘంటువు రామాయణం చరిత్రఅన్నారు. ప్రతి ఒక్కరూ శ్రీ రామ చరిత్రను గ్రహించి నడుచుకోవాలన్నారు.జిల్లా ప్రజలందరూ సుభిక్షంగా పాడిపంటలతో శాంతిభద్రతలు కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎన్. సూర్యచంద్రరావు, ఎస్.బి సిఐ వి. రవి కుమార్, ఉత్సవ ఆహ్వాన కమిటీ సభ్యులు ఆర్‌ఐ పవన్ కుమార్, డిఎస్‌పి కే ప్రభాకర్‌రావు, ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి జివిఎస్ పైడేశ్వరరావు, ఎస్‌సి, ఎస్‌టి డిఎస్‌పి ఉమామహేశ్వరరావు, రెండవ పట్టణ సిఐ పి.చంద్రశేఖర రావు, వరప్రసాద్, పోలీస్ అధికారుల సంక్షేమ నోడల్ అధికారి హెూంగార్డ్ ఆర్.ఐ. ఎం. రాజా, ఆర్.ఎస్.ఐ సుధాకర్ రెడ్డి, భాస్కర రావు,శివ ప్రసాద్ లు, పోలీస్ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి

విశాలాంధ్ర-తణుకు: శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. తణుకు మండలం దువ్వ గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయం ప్రాంగణంలో గురువారం నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకలు పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రమాదవశాత్తు పందిళ్లు మంటకు ఆహుతయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లుగా భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వేగం వద్దు... ప్రాణం ముద్దు : ఎస్పీ

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడం వలన ప్రాణహాని ఉండదని జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ అన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్, కైకలూరు సర్కిల్, అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో విజిబుల్ పోలీసింగ్, రాత్రిపూట వాహనచోదుకులకు వాష్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వలన ప్రాణహాని ఉండదన్నారు. ప్రమాద సమయంలో ప్రాణ రక్షణగా ఉంటుందని, వేగం వద్దు ప్రాణం ముద్దు అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈనెల 27, 28, 29 తేదీలలో ఇ-చలాన్‌లు - 1,990 విధించినట్లు తెలిపారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనదారులు నడిపే వారిపై 1,148 కేసు లు,వాహనాలు నడిపే సమయంలో లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ కేసులు301,వాహనాలకు ఇన్సూరెన్స్ లేకుండా నడిపిన వారిపై 06 కేసులు నమోదు చేశామన్నారు.ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణం చేసిన వారిపై 51 కేసులు,అతివేగం, నిర్లక్ష్యంగా నడిపిన వారిపై 3 కేసులు,మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై34 కేసులు,బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై70 కేసు లు నమోదు చేసినట్లు వెల్లడించారు.

కుక్కల బారిన పడుతున్నాం... కాపాడండి

విశాలాంధ్ర - లింగపాలెం : యడవల్లిలో తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ బుధవారం రాత్రిబస కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. గ్రామంలోని రామాలయానికి దాదాపు ఐదు ఎకరాలు ఇస్తామని ఈ భూమిని దేవాదాయ శాఖలో నమోదు చేయాలని పలువురు కోరారు. దీనిపై దేవాదాయ శాఖతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటానని తహశీల్దార్ తెలిపారు. గ్రామంలో కుక్కల దాడుల వల్ల బహిరంగంగా తిరగలేకపోతున్నామని, వీటి దాడిలో ప్రజలు గాయాలపాలవుతున్నారని, వీటి బారి నుంచి ప్రజలను కాపాడాలంటూ తహశీల్దార్‌కు మొర పెట్టారు. గ్రామంలో దోమలు అధికంగా ఉన్నాయని, వీటి వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందంటూ తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించేలా పంచాయితీరాజ్ శాఖాధికారులతో మాట్లాడతానని తహశీల్దార్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాత్రి బస నిర్వహిస్తున్నట్టు ఈయన అన్నారు.

విశ్వాసయాత్ర

విశాలాంధ్ర - లింగపాలెం : క్రైస్తవులు పాటించే శ్రమల దినాలలో భాగంగా పాచ్చా నగరం ఆర్‌సిఎం క్రైస్తవ మతగురువు ఏసు రత్నం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. విశ్వాసులు పాచ్చా నగరం నుంచి తడికలపూడిలోని చర్చి వరకు పాదయాత్ర నిర్వహించి ఇక్కడ దివ్యబలి పూజలో పాల్గొన్నారు. విశ్వాసం, భక్తితో జరిగిన ఈ యాత్రలో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా అందజేత

విశాలాంధ్ర-కుక్కునూరు: ఇటీవల అమరవరం గ్రామానికి చెందిన సోయం పాపారావు మృతి చెందారు. గురువారం ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా కింద రూ. 2 లక్షల చెక్కును ఎపిజివిబి ఉప్పేరు శాఖ మేనేజర్ దినేష్ కుమార్ నామిని అయిన మృతుని భార్య కళావతికి అందజేశారు. ఈసందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఖాతాదారు ప్రధాన మంత్రి సురక్ష భీమా చేయించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా బ్యాంక్ అసిస్టెంట్ పవన్ కుమార్, బ్యాంక్ మిత్ర రత్నకుమారి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు సేవా గుణం కలిగి వుండాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: సమాజంలో ప్రతి ఒక్కరు సేవా గుణం కలిగి వుండాలని జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్రి బాల రాజు తెలిపారు. బండి వారిగూడెం పంచాయతీ లోని గంగినీడి పాలెంలో ఎన్ ఆర్ ఐ జనసేన (అమెరికా) సత్య వెజ్జు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్ ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. అనంతరం దాత తల్లిదండ్రులు వెజ్జు గోపాలరావు, సరస్వతీ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, కార్యదర్శులు గెడ్డమనుగు రవికుమార్, తుట్టి రామచంద్రం, మండల అధ్యక్షులు అడపా నాగరాజు, మధ్యాహ్నపు చినవెంటారావు,జట్ల సత్యనారాయణ,ఆళ్ళ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఆచరణలో చూపాలి

కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: పట్టణాల అభివృద్ధి మాటల్లో కాదు ఆచరణలో ఉండాలని , పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చెయ్యాలని పురపాలక సంఘం అధికారులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరు భీమవరం పురపాలక సంఘం పరిధిలో పలు ప్రాంతాల్లో జిల్లా కలెక్టరు సుడిగాలి పర్యటనలు చేశారు.అండర్ పాస్ దగ్గరలో ఫుడ్ కోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. డి మార్ట్ ఎదురుగా రోడ్డు ఆక్రమణలు తొలగించిన ప్రాంతాన్ని జిల్లా కలెక్టరు నిశితంగా పరిశీలించి అధికార్లకు దిశా నిర్దేశం చేశారు. సోమగుండం చెరువు, ఎడ్వర్డ్ ట్యాంకు సుందరీకరణ పనుల కోసం స్థల సేకరణ ఆమె పరిశీలించారు. పురపాలక సంఘం ఆవరణలో నిర్మించిన పార్కును పరిశీలించి పలు సూచనలను జిల్లా కలెక్టరు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ట్రాఫిక్ కు ,ప్రజల ప్రయాణంకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. ఆక్రమణలుంటే తొలగించుటలో రాజీ పడవద్దని ఆమె ఆదేశించారు. ప్రజోపకర మైన పనులలో నిర్లక్ష్య ధోరణి సరికాదని హితవు పలికారు. వేసవి కాలం కనుక మరింత ఎక్కువ దుమ్ము రేగుతుందని ఈ రెండు నెలల కాలంలోనే సాధ్యమైనంత ఎక్కువ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు మార్జిన్లలో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం తదితర చర్యలను వెంటనే చేపట్టాలన్నారు.రోడ్డు మార్జిన్ కు, షాపులకు మధ్య ఉన్న ఖాళీ స్థలం వలన ఎక్కువ దుమ్ము షాపుల్లోకి చేరుతుందని, దుమ్ముతో కూడిన గాలిని పీల్చుకోవడం కారణంగా వారికి హాని జరుగుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్ లో ఉన్న వివిధ షాపుల ముందు తప్పని సరిగా పేవర్ బ్లాక్స్ ను ఏర్పాటు చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి సూచించారు.జిల్లా కలెక్టరు వెంట పురపాలక సంఘ కమిషనరు యస్. శివరామ కృష్ణ, డిఇఇ టివి నారాయణరావు, టిపివో సీతారామయ్య, ఏఈలు వై. శ్రీనివాస్, డి.రవితేజ, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో ఆల్ టైమ్ రికార్డు

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా చరిత్రలో 2022-23 ఆర్థిక సంవత్స రంలో అత్యధిక పని దినాలు కల్పించి చరిత్ర సృష్టించబడిందని ఏలూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ప్రాజెక్ట్ డైరెక్టర్ దుండి రాంబాబు తెలిపారు. జిల్లాలో నిర్దేశిత పని దినాల లక్ష్యం 1కోటి42 లక్షలు కాగా, 1కోటి 44 లక్షల పనిదినాలు మార్చి 28 వరకు కల్పించడం జరిగిందన్నారు. 3 లక్షల 71 వేల కుటుంబాలకు చెందిన 6 లక్షల 65 వేల మంది వేతన దారులకు ఉపాధి కల్పించామన్నారు. రూ. 303.85 కోట్ల రూపాయల వేతనాలు చెల్లించడం జరిగిందన్నారు. రూ. 106.13 కోట్ల మెటీరియల్ చెల్లింపులు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ పి. అరుణ్ బాబు మార్గదర్శకత్వం, ఇతర డివిజనల్, మండల స్థాయి అధికారుల సహకారంతో ఈ ఘనత సాధించినట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవోల విశిష్ట నాయకత్వం,ఏ.పి.డి.లు, ఏ.పి.ఓ.లు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బేర్ ఫుట్ టెక్నీషియన్లు, ప్లాంటేషన్ సిబ్బంది,క్లస్టర్ ఆఫీస్, ఎం.టి.సి.లు, అన్నింటికి మించి ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్విరామ కృషి వల్ల ఇంతటి ఘనమైన విజయాన్ని సాధించగలిగామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అత్యంత నీతివంతంగా ప్రతి ఉపాధి వేతన దారుడూ సంతోషించే విధంగా ఈ పథకం జిల్లాలో అమలు చేస్తామని ఆయన తెలిపారు. ఈ విజయంలో భాగస్వాములైన ప్రజా ప్రతినిధులకు, మీడియా ప్రతినిధులకు డ్వామా పిడి డి.రాంబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్ర స్థాయిలో సాధించిన ఘనతను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ, మూల్యాంకనం చేయడంలో తోడ్పడిన డ్వామా కార్యాలయ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

సీపీఐ సభ్యురాలు దొరలక్ష్మి మృతికి సంతాపం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: సీపీఐ సభ్యురాలు మేడ్డి దొరలక్ష్మి (అమ్ములు) మృతికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపాన్ని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గురువారం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, తాడేపల్లిగూడెం పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు,జాన్ రాజు లతో కలసి తాడేపల్లిగూడెంలో మేడ్డి దొరలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దండగర్రకు చెందిన సీపీఐ సీనియర్ నాయకులు మేడ్డి గంగాచలం కుమారుడు మేడ్డి సత్యనారాయణ సతీమణి దొరలక్ష్మి,ఈనెల 19 వతేదీన తాడేపల్లిగూడెం లోని ఆమె నివాసంలో గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. దొరలక్ష్మి గత 25 సంవత్సరాలుగా సీపీఐ సభ్యురాలుగా వున్నారు.

కౌలు రైతులకు చట్ట సవరణ చేయాలి

విశాలాంధ్ర-చింతలపూడి: యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు కౌలు కార్డులు ఇచ్చేలా చట్ట సవరణ చేయాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి దొంత కృష్ణ, రైతు సంఘం నాయకులు రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక శాసనసభ్యులు ఉన్నమట్ల ఎలిజా రేచర్ల విచ్చేసిన సందర్భంగా ఏపీ రైతు సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఆయిల్ ఫామ్ రైతులు, పామాయిల్ కౌలు రైతులు, పామాయిల్ పంట ఎకరానికి సంవత్సరానికి 6 నుంచి 8 టన్నులు మాత్రమే వస్తుందని దీనివలన రైతులు కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. పామాయిల్ టన్ను ధర రూ. 20వేలుగా ప్రభుత్వం నిర్ణయించే విధంగా కృషి చేయాలని కోరారు.

3 నుంచి వైఎస్ఆర్ పింఛను కానుక చెల్లింపులు

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వై ఎస్ ఆర్ పింఛను కానుక ఏప్రియల్ నెల పింఛను చెల్లింపులు బ్యాంకు ఆర్థిక సంవత్సరం ముగింపు, వరుస సెలవు దినముల కారణంగా పింఛను పంపిణీ ఏప్రియల్ 3 వ తేదీ నుండి ప్రారంభమవుతుందని సెర్ప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారు తెలియజేసినట్లు డిఆర్‌డిఏ పిడి ఆర్.విజయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పింఛను పంపిణీ ఏప్రిల్ 3 నుండి ప్రారంభమవుతుందని, ఈ విషయాన్ని జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సచివాలయ సిబ్బంది, గ్రామ, వార్డు వాలంటీర్ల ద్వారా ముందుగా పింఛనుదారులకు తెలియజేయవలసిందిగా ఆయన కోరారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలి

విశాలాంధ్ర-కుక్కునూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలైన వాల్మీకి,బెంతు ఒరియా,బోయ లను ఎస్టీ జాబితాలో చేర్చాలని నిర్ణయం తీసుకోవడం చాలా దారుణమని ఇంకా వెనుక బడి ఉన్న ఆదివాసీ కులాల అభివృద్ధికి ఆటంకమని ఖచ్చితంగా ఎస్‌టి జాబితాలో వారిని చేర్చే విషయం పునః సమీక్షించుకోవాలని యూటీఎఫ్ కుక్కునూరు మండల కమిటీ అధ్యక్షులు గుండి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం యుటిఎఫ్ సంఘ మండల సమావేశం కుక్కునూరులో జరిగింది.ఈ నెల 31న గిరిజన సంఘాలు యిచ్చిన ఏజెన్సీ ప్రాంత బంద్‌కు యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బానారీ బాలకృష్ణ, కీసరి సాంబశివరావు, తాటి బాలరాజు, తెల్లం రమాదేవి, వంకుడోత్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురి మృతి

విశాలాంధ్ర -జంగారెడ్డిగూడెం: స్థానిక తల్లాడ దేవరపల్లి జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఒక మహిళ కు తీవ్ర గాయాల య్యాయి. సత్తుపల్లి మండలం క్రిస్టారంకు చెందిన నక్కా రవి తూర్పుగోదావరి జిల్లా గోకవరంకు చెందిన తన మేనల్లుడు వేల్పుల బెంజిమన్ ను,తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనం పై జంగారెడ్డిగూడెం నుండి సత్తుపల్లి వైపు వెళ్తుండగా విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గరకు వెళ్లే సరికి హైదరాబాద్ వైపు నుండి వస్తున్న లారీ ద్వి చక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో మేనమామ నక్కా రవి (45)మేనల్లుడు వేల్పుల బెంజిమెన్ (12) అక్కడికక్కడే మరణించారు .నక్కా రవి భార్య కు తీవ్ర గాయాలవడంతో స్థానికులు స్థానిక ఏరియా ఆసుపత్రి కి తరలించారు. సిఐ బాల సురేష్ బాబు, ఎస్ఐ సాగర్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి కి పంపించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ పరీక్ష

విశాలాంధ్ర - పెనుమంట్ర : విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ముందుగా పదవ తరగతి టాలెంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు మార్టేరు గ్రామ సమన్వయ కమిటీ సభ్యులు తెలియజేశారు. గురువారం మార్టేరు గ్రామ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మార్టేరు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 165 మంది విద్యార్థిని ,విద్యార్థులకు మార్టేరు రెడ్డి కళ్యాణ మండపంలో పదవ తరగతి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.మండల పరిషత్ అధ్యక్షులు కర్రి వెంకట నారాయణ రెడ్డి (వాసు) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు విద్యార్థులకు పరీక్షల పైన ఉండేటటువంటి భయాన్ని పోగొట్టేందుకు పదవ తరగతి టాలెంట్ పరీక్ష ముందుగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ప్యాడ్లను, పెన్నులను పంపిణీ చేశారు. మార్టేరు ఎంపీటీసీలు కర్రి అనురాధ జోగిరెడ్డి ,గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, నెగ్గిపూడి ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, వెలగలేరు సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు

విశాలాంధ్ర - పెనుమంట్ర: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేం దుకే చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు ద్వారంపూడి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం పంచ గ్రామ రెడ్డి సేవ సంఘం వారి ఆధ్వర్యంలో మార్టేరు నాలుగు రోడ్ల జంక్షన్‌లో చలివేంద్రాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు ద్వారంపూడి వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సంఘం అధ్యక్షులు ఆచారి రెడ్డి,గుడిమెట్ల లక్ష్మణ రెడ్డి, అల్లం భాస్కర్ రెడ్డి, వెలగల సోమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా శ్రీరామనవమి

విశాలాంధ్ర-కుక్కునూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించారు. అనంతరం బెల్లం మిరియాలతో చేసిన పానకాన్ని సేవించి, ఉత్సవ మూర్తుల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కామవరపుకోటలో : శ్రీరామనవమి వేడుకలు మండలంలో వాడవాడల ఘనంగా నిర్వహించారు. చిన్న భద్రాద్రిగా పేరుగాంచిన తూర్పు ఎడవల్లి గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ వేడుకలు చలువ పందిళ్ల వేదమంత్రాలతో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భారీ అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. కామవరపుకోట కొత్తూరు గ్రామం లోని రామాలయం వద్ద భారీ అన్నసంతర్పణ చేశారు.

లింగపాలెంలో : రాములోరి కళ్యాణ వేడుకలను లింగపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాలలో ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని గ్రామాలలో సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. పలు పంచాయితీలలో సర్పంచ్ దంపతులు రాముడు, సీతకు కళ్యాణం జరిపించారు. మండలంలోని అన్ని గ్రామాలలో అన్నసమారాధన జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవాలలో పాల్గొన్నారు.

జట్లపాలెంలో : జట్లపాలెంలో శ్రీ రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ కుదుళ్ళ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. 9 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఉదయం సీతారాముల కళ్యాణం నిర్వహించారు.

గొల్లగూడెంలో : అప్పారావుపేట గ్రామ శివారు గొల్లగూడెంలో శ్రీరామనవమి సందర్భంగా జయ శ్రీరామ్ రామాలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దండగర్ర, పుల్లాయిగూడెం, ఉప్పరగూడెం, మోదుగగుంట తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి మృతి జిల్లా ప్రజలకు తీరని లోటు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యులు,యర్రా నారాయణస్వామి మృతి జిల్లా రాజకీయాలకు, ప్రజలకు తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణస్వామి నీతికి నిలువుటద్దం, అజాతశత్రువు అని కొనియాడారు. అనేక పదవులు నిర్వహించినా ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి యర్రా నారాయణ స్వామి అని కొనియాడారు. గతంలో తెలుగుదేశం, సిపిఐ ఎన్నికల పొత్తులో భాగంగా సిపిఐ భద్రాచలం పార్లమెంటు స్థానానికి పోటీ చేసినప్పుడు సోడే రామయ్య ని ఎంపీగా పోటీ పెట్టిన కాలంలో తాను యర్రా నారాయణస్వామి తో కలిసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పోలవరం, గోపాలపురం నియోజకవర్గం ఎన్నికల ప్రచారం నిర్వహించామన్నారు. ఆ సమయంలో ఆయన మంచితనం, వ్యక్తిత్వాన్ని గమనించానని తెలిపారు. ఆయన నిరాడంబరత, నిబద్ధత వెలకట్టలేనివని కొనియాడారు. యువత, నేటి తరం నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.యర్రా నారాయణస్వామి మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

నిబద్ధత కలిగిన రాజకీయ నేత నారాయణస్వామి

విశాలాంధ్ర-ఉండి: నిబద్ధతతో కూడిన రాజకీయ నేత యర్రా నారాయణస్వామి అని సిపిఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కొనియాడారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యులు, యర్రా నారాయణ స్వామి మృతి చెందారు అనే వార్త తెలియగానే గురువారం ఉప్పులూరులో నారాయణస్వామి భౌతిక కాయానికి భీమారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఎర్రా నారాయణస్వామి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ నీతి, నిజాయితీ, నిరాడంబరత, నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయాలకు చిరునామాగా, అజాతశత్రువుగా జిల్లా ప్రజల ఆదరాభిమానాలు పొందిన గొప్ప నేత యర్రా నారాయణస్వామి అని కొనియాడారు. పోలవరం ప్రాజెక్టు సాధనకు సిపిఐ తో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి లక్ష్యంగా పార్టీలకు అతీతంగా, రాజకీయాలకతీతంగా పనిచేసే నారాయణస్వామి మృతి జిల్లా ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. నారాయణస్వామి మృతికి తీవ్ర సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.రమేష్ నారాయణస్వామి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యర్రా నారాయణస్వామి మహానేత

విశాలాంధ్ర-ఉండి: ఎంత ఎదిగినా ఒదిగి ఉండే మహానేత యర్రా నారాయణస్వామి అని సిపిఐ ఉండి మండల కార్యదర్శి కలిశెట్టి వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో కొనియాడారు. పశ్చిమగోదావరి జిల్లా రాజకీయాల్లో కీలక వ్యక్తిగా పనిచేసిన ఉప్పులూరు గ్రామ సర్పంచ్ గా ప్రారంభమైన యర్రా నారాయణస్వామి జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, రాజ్యసభ సభ్యునిగా ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. ఈ మహా నేత ఎంత ఎదిగిన ఒదిగే ఉంటూ ప్రజలతో కలిసిపోయి పనిచేస్తూ ప్రజల గుండెల్లో తనకంటూ అభిమానాన్ని సంపాదించు కున్నారని అన్నారు. ఆయన మృతికి పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండల సీపీఐ సమితి తరఫున తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

యర్రా మృతికి సీపీఐ మండల సమితి సంతాపం

విశాలాంధ్ర - కామవరపుకోట : మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి మృతికి సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టీవీఎస్ రాజు గురువారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. తెలుగుదేశం, సిపిఐ ఎన్నికల ఒడంబడికలో భాగంగా సిపిఐ భద్రాచలం పార్లమెంటు స్థానానికి సోడే రామయ్యని ఎంపీగా పోటీ పెట్టిన కాలంలో యర్రా నారాయణ స్వామి సిపిఐ విజయం కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. పార్టీ శ్రేణులతో ప్రజానాట్యమండలి కళారూపాలతో పోలవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కేంద్రంగా ఎన్నికల ప్రచారం చేస్తున్న కాలంలో ప్రజానాట్యమండలి కళారూపాలతో ఎన్నికల ప్రచారం చేస్తున్న సరళిని చూసిన ఆయన కళా ప్రదర్శనకు కూడా వచ్చి డప్పు చేత పట్టుకుని కళ ద్వారా మీ ప్రచారం ఎంతో బాగుంది నా ఉపన్యాసం కంటే మీ కళలకే ప్రజలు స్పందించి ఓటేసి సోడే రామయ్యను గెలిపించడం తథ్యం అనేవారని టీవీఎస్ రాజు ఆనాటి కాలాన్ని గుర్తుకు తెచ్చుకుని యర్రా నారాయణస్వామికి నివాళులర్పించారు. ఆయన మృతికి ఏపీ ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు, సీనియర్ బుర్రకథ కళాకారులు సబ్బి కనకారావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, కార్యవర్గ సభ్యులు జి. సత్యనారాయణ, ఎం. దుర్గారావు తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఏప్రిల్ 3,4 తేదీలలో చేనేత నిరాహార దీక్షలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర -ఏలూరు: ఏప్రిల్ 3, 4 తేదీలలో శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం చేస్తున్న నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. చేనేత రిజర్వేషన్ చట్టం ప్రకారం 11 రకాల వస్త్రాలు చేనేత మగ్గాల పైనే తయారు చేయాలని, పవర్ మగ్గాలపై ఉత్పత్తి చేస్తూ ఉండడం వలన చేనేత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి చేనేత కుటుంబానికి 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.1 లక్ష 50 వేల నుండి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. చేనేత వస్త్రాలపై జిఎస్‌టి తొలగించాలన్నారు. చేనేత అనుబంధ కార్మికులందరికీ నేతన్న నేస్తం పథకం వర్తింపచేయాలని కోరారు. అర్హులైన నేత కార్మికులకు ప్రభుత్వం 3 సెంట్లు స్థలంలో హౌస్ కం వర్క్ షెడ్ నిర్మించాలని కోరారు. ధర్మవరంలో మెగా చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలని తమ సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మన్యం బంద్‌కు సహకరించండి

విశాలాంధ్ర-కుక్కునూరు: రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకి (బిసి) గిరిజనేతర కులాలను గిరిజన తెగలు(ఎస్టీ) జాబితాలోకి చేర్చడాన్ని నిరసిస్తూ శుక్రవారం మన్యం బంద్ నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య కుక్కునూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు వరసా పాపారావు, సోడె నాగేష్ కోరారు. బోయ వాల్మీకి ప్రజలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని వైసీపీ ప్రభుత్వం చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో వైసీపీ తీర్మానాన్ని ఆమోదం తెలిపిన టిడిపి, బిజెపిల వైఖరిని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు.

ప్రక్షాళనా...ఇంతేనా ?

- చింతలపూడి నియోజకవర్గ రాజకీయాలు ఎటువైపు ?
- పట్టు నిలుపుకునే పార్టీ ఏది
- రాజకీయాలపై ఆసక్తికరమైన చర్చ

విశాలాంధ్ర - లింగపాలెం : ప్రక్షాళనా.. ఇంతేనా ? ఇదీ చింతలపూడి నియోజకవర్గ రాజకీయాలపై రాజకీయవర్గాలలో నెలకొంటున్న ప్రశ్నలు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో ఊహించని ఫలితాలు రావటంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రాజకీయ చైతన్యం కలిగిన చింతలపూడి నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. సార్వత్రిక ఎన్నికలకు ఏడాదికిపైగా సమయం ఉన్నా ఈ నియోజకవర్గంలో రాజకీయ కార్యకలాపాలు అప్పుడే జోరుగా సాగుతున్నాయి.

అసమ్మతులు.. పట్టుకోసం పాట్లు : నియోజకవర్గంలో అధికార పార్టీలోని అసంతృప్తులు, ప్రతిపక్ష పార్టీలో పట్టు కోసం చేస్తున్న నాయకుల ప్రయత్నాలు ఎలా మారతాయోనని రాజకీయ వర్గాలలో ఆసక్తి నెలకొంది. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన ఉన్నమట్ల ఎలీజా 32 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించి రాష్ట్రంలో అత్యధిక మెజార్టీ సాధించిన వారి జాబితాలో నిలిచారు. పార్టీని ఏకతాటిపై ఉంచలేకపోయారని ఈ పార్టీ నాయకులే విమర్శలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతీ పంచాయతీలో రెండు గ్రూపులు ఉన్నాయనేది వాస్తవం. నియోజకవర్గంలోని పార్టీ అధిష్టానం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలతో పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నామని పలువురు నాయకులు బహిరంగంగానే అంటున్నారు. ఈ పరిస్థితులను ఎలా చక్కదిద్దుతారో ? లేదంటే వదిలేస్తారా ? అనేది పార్టీ అధిష్టానం నిర్ణయమని అధికార పార్టీలోని అసమ్మతివాదులు వేచి చూస్తున్నారు.

రిజర్వుడు అయినా పట్టు నిలుపుకోలేకపోతున్న ఎమ్మెల్యేలు : నియోజకవర్గంలో 2009లో ఎస్సీ రిజర్వుడుకు కేటాయించారు. 2009లో మద్దాల రాజేష్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పట్లో నెలకొన్న రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. ఎమ్మెల్యేగా ఉన్నా అధికార పార్టీలో లేకపోవటంతో ఏడాదిన్నర కాలం పేరుకే ఎమ్మెల్యేగా ఉన్నారు. 2014లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా పీతల సుజాత గెలుపొందారు. ఈమె మంత్రి అయ్యారు. నియోజకవర్గంలో పార్టీలో సహకారం అందించిన నాయకులే జిల్లాలోని పలువురు నాయకులతో చేతులు కలిపి ఈమె మంత్రి పదవిని తీసే వరకు ఊరుకోలేదు. ఈమె మంత్రిగా పూర్తి కాలం కొనసాగలేక పోయారు. మంత్రిగా తొలగించినా పార్టీ పట్ల విధేయతతో నిబద్ధతను నిలుపుకున్నారు. 2019లో వైసీపీ ఎమ్మెల్యేగా ఎలీజా భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈయన ఏకపక్ష నిర్ణయాలతో వ్యతిరేకత తెచ్చుకున్నారనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. వ్యూహాలు, ప్రతి వ్యూహాలలో ధీటైన రాజకీయ చరిత్ర కలిగిన నియోజకవర్గంలో ముగ్గురు ఎమ్మెల్యేలు పరిణితిగా వ్యవహరించలేదని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

స్వాతంత్ర్యం వచ్చాక నియోజకవర్గంలో ఎస్సీ ఎమ్మెల్యేలకు గుర్తింపు ఉంది. చింతలపూడి, తాడేపల్లిగూడెం సంయుక్త నియోజకవర్గాలుగా ఉన్నప్పుడు 1955లో ఎస్సీ ఎమ్మెల్యేగా నంబూరి శ్రీనివాసరావు గెలుపొందారు. చింతలపూడి ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడి మొదటిసారి 1962లో జరిగిన ఎన్నికల్లో ఎస్సీ ఎమ్మెల్యేగా రేవులగడ్డ ఏసుపాదం గెలుపొందారు. 1972 ఎన్నికలలో జనరల్ కేటగిరీలో ఎస్సీ అభ్యర్థి దయ్యాల దానయ్య(ఇమ్మాన్యుయేలు)కు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలబెట్టింది.

నియోజకవర్గంలో ఎస్సీలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇప్పటివరకు ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారు రెండోసారి పదవుల్లోకి రాలేకపోయారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో కొంత మంది నాయకులు దశాబ్దాలుగా తమ పదవులను నిలబెట్టుకుంటున్న చరిత్ర ఉంది. ఈ నియోజకవర్గంలో అర్థబలం, అంగబలంతో విజయాలు సాధిస్తున్న నాయకులు వచ్చిన పదవిని నిలబెట్టుకునేలా పాలన చేస్తే ఓటర్లు, ప్రజల అభిమానాన్ని పొందుతారు.

వచ్చిన పదవులను అలంకారంగా చూడటం వల్ల ప్రతికూలతను ఎదుర్కొంటున్నారనే విమర్శలు ఉన్నాయి.